


అడ్వెంచర్ అవార్డుల కోసం దరఖాస్తుల ఆహ్వానం 7వ

అర్ధరాత్రి సచివాలయం నుంచి మెటీరియల్ తరలింపు



కూటమికి భారీగా ఓటింగ్

జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లోను కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. వీటిలో మెజార్టీలు భారీగా వచ్చాయి. తుని స్వల్ప మెజార్టీ రాగా మిగిలిన అన్నిచోట్ల మెజార్టీలు అధికంగా ఉన్నాయి. పోలింగ్ బూత్‌లవారీగా మెజార్టీల్లో ఎక్కువచోట్ల కూటమి హవా కనబర్చింది.

- జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ బూత్‌ల వారీగా మెజార్టీల తీరిది

పిఠాపురంలో జనసేనకు భారీగా ఓటింగ్

పిఠాపురం, జూన్ 6: పిఠాపురం నియోజకవర్గంలో పోలింగ్ బూత్‌ల వారీగా పవన్‌కల్యాణ్ భారీ మెజార్టీలు సాధించారు. అక్కడక్కడా వైసీపీ మెజార్టీ సాధించినా చివరి వరకూ జనసేన హవా నడిచింది. పిఠాపురం నియోజకవర్గంలో 242 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 207 కేంద్రాల్లో జనసేన పార్టీ మెజార్టీ సాధించగా, వైసీపీ 34 కేంద్రాల్లో మెజార్టీ సాధించింది. 78వ పోలింగ్ కేంద్రంలో మాత్రం వైసీపీ, జనసేనకు సరిసమానంగా 412 వంతున ఓట్లు లభించాయి. పిఠాపురం నుంచి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీ చేసి ఎమ్మెల్యేగా విజయం సాధించగా, వైసీపీ తరపున పోటీ చేసిన వంగా గీతావిశ్వనాథ్ పరాజయం పాలయ్యారు.

గొల్లప్రోలు మండలం దుర్గాడలో 12వ పోలింగ్ కేంద్రంలో జనసేనకు 877 ఓట్లు మెజార్టీ లభించింది. ఇక్కడ జనసేనకు 969, వైసీపీకి కేవలం 92ఓట్లు లభించాయి. ఇదే గ్రామంలోని 14వ పోలింగ్ కేంద్రంలో 871 మెజార్టీ రాగా జనసేనకు 976 ఓట్లు, వైసీపీకి 65 ఓట్లు పోలవ్వగా, 15వ పోలింగ్ కేంద్రంలో జనసేనకు 823 ఓట్లు రాగా వైసీపీకి 114 ఓట్లు రావడతో 709 ఓట్లు మెజార్టీ లభించింది. దుర్గాడలోని 9,10,11,12,13,14,15 పోలింగ్ కేంద్రాల పరిధిలో జనసేనకు 5,638ఓట్లు రాగా వైసీపీకి 1,271ఓట్లు రాగా 4,367ఓట్ల మెజార్టీ లభించింది. గొల్లప్రోలు మండలం చేబ్రోలు 37వ పోలింగ్ కేంద్రంలో జనసేనకు 828ఓట్లు, వైసీపీకి 132ఓట్లు రాగా 696 ఓట్లు మెజార్టీ లభించింది. 39వ పీఎస్‌లో జనసేనకు 437, వైసీపీకి 51 రాగా మెజార్టీ 386 లభించింది. పిఠాపురం మండలం భోగాపురం పోలింగ్ కేంద్రం 87లో జనసేనకు 604, వైసీపీకి 86 ఓట్లు రాగా మెజార్టీ 518 వచ్చింది. పిఠాపురం పట్టణంలోని 166వ పోలింగ్ కేంద్రంలో జనసేనకు 770ఓట్లు రాగా వైసీపీకి 96ఓట్లు వచ్చాయి. ఇక్కడ మెజార్టీ 674ఓట్లు వచ్చింది. 155లో జనసేనకు 403, వైసీపీకి 70ఓట్లు రాగా మెజార్టీ 333, 148లో జనసేనకు 1016, వైసీపీకి 155రాగా మెజార్టీ 861ఓట్లు, 153లో జనసేనకు 628, వైసీపీకి 87 ఓట్లు, మెజార్టీ 541ఓట్లు, పిఠాపురం మండలం చిత్రాడ పీఎస్ నెంబరు 168లో జనసేనకు 850, వైసీపీకి 101ఓట్లు రాగా, మెజార్టీ 749 వచ్చింది. కొత్తపల్లి మండలం యండపల్లిలోని 218వ పోలింగ్ కేంద్రంలో జనసేనకు 584, వైసీపీ 44ఓట్లు రాగా మెజార్టీ 540ఓట్లు, గోర్సలోని 241 పోలింగ్ కేంద్రంలో జనసేనకు 807ఓట్లు, వైసీపీకి 94ఓట్లు రాగా మెజార్టీ 713ఓట్లు వచ్చాయి. ఇలా నియోజకవర్గంలో 85 పోలింగ్ బూత్‌ల్లో జనసేనకు 70నుంచి 90శాతంపైగా ఓట్లు పోలయ్యాయి.

కాకినాడ సిటీలో టీడీపీ కూటమికి గంపగుత్తగా ఓట్లు

కాకినాడ సిటీ, జూన్ 6: కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పలు బూత్‌ల్లో టీడీపీ కూటమికి గంపగుత్తగా ఓట్లు పడ్డాయి. అనేక బూత్‌ల్లో 70 నుంచి 80శాతం వరకు ఓట్లు నమోదయ్యాయి. దీంతో ఎన్నికల ఫలితాల ప్రతి రౌండ్‌లోను టీడీపీ ఆధిక్యతను చాటుకుంది. వైసీపీకి పడిన ఓట్ల కంటే టీడీపీకి వచ్చిన ఓట్ల మెజారిటీ ఎక్కువగా ఉంది. మొత్తంగా పోలైన ఓట్లలో మూడింట రెండొతులు ఓట్లు టీడీపీకి వచ్చాయి. కాకినాడ సిటీ నియోజకవర్గ పరిధిలో 1,77,211 మొత్తం ఓట్లకుగాను టీడీపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబుకు 1,13,014 ఓట్లు రాగా, వైసీపీ అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డికి 56,442 ఓట్లు పడ్డాయి. దీంతో టీడీపీ అభ్యర్థి కొండబాబు 56,572 ఓట్ల మెజారిటీతో విజేతగా నిలిచారు. ఇక కాకినాడ సిటీ నియోజకవర్గ పరిధిలోని 233 బూత్‌ల్లో పది డివిజన్‌లకు పైగా బూత్‌ల్లో టీడీపీకి 70శాతం వరకు ఓట్లు పడ్డాయి. ఏటిమొగ 14,15 డివిజన్‌ల్లో 182 నుంచి 192 బూత్‌ల్లో పోలైన 8,704 ఓట్లకుగాను టీడీపీకి 6,807 పడ్డాయి. 10వ డివిజన్ దుమ్ములపేట 92 నుంచి 97 బూత్‌ల్లో పోలైన 5859 ఓట్లకుగాను టీడీపీకి 4,511 ఓట్లు పడ్డాయి. 12వ డివిజన్ పర్లోవపేట, సంజయ్‌నగర్ 124 నుంచి 128, 131 నుంచి 133 బూత్‌ల్లో పోలైన 6673 ఓట్లకుగాను టీడీపీకి 4,032 ఓట్లు వచ్చాయి. 11వ డివిజన్ డెయిరీఫారమ్ అపార్టుమెంట్లు 83 నుంచి 91 బూత్‌ల్లో పోలైన 6,352 ఓట్లకుగాను టీడీపీకి 3,671 ఓట్లు పడ్డాయి. 13వ డివిజన్ సాంబమూర్తినగర్, సంజయ్‌నగర్ 106 నుంచి 109, 129, 130, 134 బూత్‌ల్లో పోలైన 4,323 ఓట్లు రాగా, టీడీపీకి 2,543 ఓట్లు పడ్డాయి. జగన్నాథపురం ఎన్టీఆర్ నగర్, అన్నమ్మఘాటీ ఏరియా, పాత బస్టాండ్ ఏరియా, రేచెర్లపేట, రామకృష్ణారావుపేట ప్రాంతాల్లో టీడీపీకి భారీగా ఓట్లు పడ్డాయి.

తునిలో 15ఏళ్ల తర్వాత టీడీపీ పాగా

తుని రూరల్, జూన్ 6: తుని నియోజకవర్గంలో కూటమి ఉమ్మడి అభ్యర్థి 15ఏళ్ల తరువాత టీడీపీ జెండాను రెపరెపలాడించారు. వైసీపీ అభ్యర్థి దాడిశెట్టి రాజా హ్యాట్రిక్‌కు యనమల దివ్య బ్రేక్ వేశారు. ఆమె తండ్రి యనమల రామకృష్ణుడు తునిలో వరుసగా ఆరుసార్లు విజయం సాధించి రికార్డులు సృష్టించారు. తదనంతరం ప్రత్యక్ష ఎన్నికలకు దూరం కాగా తర్వాత ఎన్నికల్లో 15ఏళ్ల పాటు టీడీపీ అధికారానికి దూరమైంది. 2024 ఎన్నికల్లో దివ్య వైసీపీ అభ్యర్థి దాడిశెట్టి రాజాపై 15861ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. తుని నియోజకవర్గంలోని తుని పట్టణంతోపాటు తుని, తొండంగి, కోటనందూరు మండలాల్లో 80కి పైగా పోలింగ్‌బూత్‌ల్లో కూటమి అభ్యర్థి యనమల దివ్యకు గంపగుత్తిగా ఓట్లు వేశారు.

తుని నియోజకవర్గంలోని తొండంగి మండలంలోని గొల్ల మునలయ్యపేటలో 221వ బూత్‌లో వైసీపీకి 180 ఓట్లు రాగా టీడీపీకి 537 రావడంతో 357 ఓట్ల మెజార్టీ వచ్చింది. తాటాకులపాలెం 218వ బూత్‌లో వైసీపీకి 145ఓట్లు, టీడీపీకి 521 ఓట్లు రావడంతో 376 మెజార్టీ వచ్చింది. చోడిపల్లిపేటలోని 200వ బూత్‌లో వైసీపీకి 61, టీడీపీకి 399 ఓట్లు రాగా 338 మెజార్టీ వచ్చింది. గడ్డిపేటలోని 199వ బూత్‌లో వైసీపీకి 168, టీడీపీకి 559 ఓట్లు పడడంతో 391 మెజార్టీ సాధించారు. గడ్డిపేటలోని 198 బూత్‌లో వైసీపీకి 197, టీడీపీకి 395ఓట్లు పడడంతో 198 ఓట్ల మెజార్టీ లభించింది. తుని పట్టణంలోని 140వ బూత్‌లో వైసీపీకి 184, టీడీపీకి 401 ఓట్లు రాగా 217 మెజార్టీ వచ్చింది. 192వ బూత్‌లో వైసీపీకి 280ఓట్లు రాగా టీడీపీకి 691 ఓట్లు రావడంతో 507 మెజార్టీ లభించింది. 136వ బూత్‌లో వైసీపీకి 210, టీడీపీకి 603ఓట్లు రావడంతో 393 మెజార్టీ లభించింది. తుని మండలం డి.పోలవరంలోని 49వ బూత్‌లో వైసీపీకి 187 ఓట్లు, టీడీపీకి 374 ఓట్లు లభించగా 187 మెజార్టీ లభించింది. కోటనందూరు మండలం కేఈ చిన్నయ్యపాలేనికి చెందిన 18వ బూత్‌లో వైసీపీకి 370, టీడీపీకి 550 ఓట్లు రావడంతో 180ఓట్ల మెజార్టీ లభించింది.

పెద్దాపురంలో టీడీపీకి ఓట్ల వరద

సామర్లకోట, జూన్ 6: పెద్దాపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పకు గతంలో ఎన్నడూ లేని రీతిలో భారీగా, 48,815 ఓట్ల మెజార్టీతో ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థిపై ఘన విజయం సాధించారు. నియోజకవర్గంలో పెద్దాపురం, సామర్లకోట మండలాలు, రెండు పట్టణాల్లో 201 పోలింగ్ బూత్‌లు ఉండగా 1,78,849 ఓట్లు పోలయ్యాయి. వాటిలో టీడీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పకు 1,05,685 ఓట్లు రాగా వైసీపీ అభ్యర్థి దవులూరి దొరబాబుకు 65,234 ఓట్లు మాత్రమే వచ్చాయి. మొత్తం 15 రౌండ్లుగా ఓట్ల లెక్కింపు నిర్వహించగా ఒక్క పదో రౌండ్‌లో మినహా మిగిలిన అన్ని రౌండ్లలోనూ టీడీపీ ఆధిక్యత కొనసాగుతూ వచ్చింది. పెద్దాపురం పట్టణంలోని 37 పోలింగ్ బూత్‌లకుగాను 31,482 ఓట్లు పోలవ్వగా వాటిలో టీడీపీకి అత్యధికంగా 20,856 ఓట్లు వచ్చాయి. ప్రత్యర్థి వైసీపీకి కేవలం 8,911 ఓట్లు మాత్రమే దక్కాయి. పెద్దాపురం పట్టణంలో టీడీపీకి 11,945 ఓట్ల ఆధిక్యత లభించింది. సామర్లకోట పట్టణ పరిధిలో 37 పోలింగ్ బూత్‌లు ఉండగా 43,606 ఓట్లకుగాను 34,182 ఓట్లు పోలయ్యాయి. వాటిలో టీడీపీకి 20,552 ఓట్లు రాగా వైసీపీకి 12,170 ఓట్లు మాత్రమే దక్కాయి. సామర్లకోట పట్టణంలో టీడీపీకి 8,382 ఓట్ల ఆధిక్యత లభించింది. ఇక ఇదే జోరు పెద్దాపురం, సామర్లకోట మండలాల్లోను కొనసాగింది.

ప్రత్తిపాడులో 214 బూత్‌ల్లో టీడీపీ ఆధిక్యత

ప్రత్తిపాడు, జూన్ 6: ప్రత్తిపాడు నియోజకవర్గంలోని 227 పోలింగ్ కేంద్రాలకుగాను 214 పోలింగ్ కేంద్రాల్లో టీడీపీ కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభరాజా ఆధిక్యం కనబర్చారు. ఆమె 38787 ఓట్ల మెజార్టీతో సమీప వైసీపీ అభ్యర్థి వరుపుల సుబ్బారావుపై విజయం సాధించారు.

జగ్గంపేటలో టీడీపీకి వన్‌సైడ్

జగ్గంపేట, జూన్ 6: జగ్గంపేట నియోజకవర్గంలోని గోకవరం, గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి నాలుగు మండలాల్లో 248 పోలింగ్ బూత్‌లు వారీగా 18 రౌండ్లలో టీడీపీకి వన్‌సైడ్ ఓట్లు పోలయ్యాయి. కొన్ని బూత్‌ల్లో మాత్రమే వైసీపీకి టీడీపీ కంటే అధికంగా ఓట్లు పడ్డాయి.

ఆగిన సి'ఫార్సు'

- జిల్లాలో ఉపాధ్యాయుల అడ్డదారి బదిలీలకు బ్రేక్
- గుట్టుచప్పుడు కాకుండా వైసీపీ ప్రభుత్వం సిద్ధం చేసిన జాబితాకు చెక్
- నిలిచిపోయిన 18మంది టీచర్ల సిఫార్సు బదిలీలు
- డీఈవోలకు ఆదేశాలు జారీ చేసిన విద్యాశాఖ
- బదిలీల పేరుతో వీరినుంచి జిల్లాలో రూ.కోటి వరకు నొక్కేసిన వైసీపీ ఎమ్మెల్యేలు
- ఉత్తర్వులు ఆగడంతో డబ్బు వెనక్కు ఇవ్వాలంటూ ఉపాధ్యాయుల ఒత్తిడి
- కౌన్సిలింగ్ విధానం పక్కనపెట్టి కోడ్‌కు ముందు సిఫార్సులతో వైసీపీ జాబితా



(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో కొందరు ఉపాధ్యాయుల అడ్డదారి బదిలీలకు బ్రేక్ పడింది. కౌన్సెలింగ్ లేకుండా గుట్టుగా కాసులు పుచ్చుకుని బదిలీలు చేయడానికి సిద్ధపడ్డ వైసీపీ నేతలకు షాక్ తగిలింది. అధికారంలోంచి ఎలాగూ దిగిపోతున్నామనే కారణంతో ఎవరికీ తెలియకుండా ఉపాధ్యాయులను బదిలీ చేయాలన్న ప్రయత్నాలకు చెక్ పడింది. ఫలితంగా బదిలీలకు ముడుపులు ఇచ్చిన ఉపాధ్యాయులు ఇప్పుడు వాటిని వెనక్కు ఇవ్వాలంటూ జిల్లాలో ఇద్దరు వైసీపీ ఎమ్మెల్యేలు, ఇతర నేతల ఇళ్లకు వెళ్లడానికి సిద్ధమవుతున్నారు. జిల్లాలో 18మంది ఉపాధ్యాయులను కోరుకున్న చోటకు బదిలీ చేయించడానికి సదరు నేతలు ఎన్నికల కోడ్ రావడానికి ముందు రూ.కోటి వరకు ముడుపు లు తీసుకున్నారు. విద్యాశాఖ మంత్రికి చెప్పి బదిలీలకు ఫైల్ సిద్ధం చేయించారు. తీరా రాష్ట్రంలో ప్రభుత్వం మారి టీడీపీ కూటమి గద్దెనెక్కడంతో ఈ ఆటలు సాగలేదు. బదిలీల జాబితాను నిలిపి వేయాలంటూ విద్యాశాఖ గురువారం జిల్లాల డీఈవోలకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో డబ్బులు ఇచ్చుకున్న ఉపాధ్యాయులో లబోదిబోమంటున్నారు.

బదిలీకో రేటు..

అధికారం అండతో ఐదేళ్లలో జిల్లాలో విచ్చలవిడి అవినీతికి అలవాటుపడ్డ వైసీపీ నేతలు చివరకు ఉపాధ్యాయ బదిలీలను కూడా తమ అవినీతికి అడ్డాగా మార్చేసుకున్నారు. జిల్లాలో ఒక్కొక్కరినుంచి లక్షల్లో ముడుపులు దండుకుని దొడ్డిదారిన సిఫార్సు లెటర్లు ఇచ్చి బదిలీలకు పావులు కదిపారు. ఎలాగూ తమ ప్రభుత్వమే ఉండడంతో రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ హడావుడిగా ఉత్తర్వులు కూడా ఇప్పించారు. తీరా అప్పటికే ఎన్నికల కోడ్ రావడంతో కోడ్ ఎత్తివేసిన తర్వాత సిఫార్సు బదిలీలు జరగాలన్న నిబంధనతో వైసీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈక్రమంలో దొడ్డిదారి బదిలీలకు రూ.కోటి వరకు జిల్లాలో వైసీపీ ఎమ్మెల్యేలు కొందరు డబ్బులు వసూలు చేశారు. ప్రధానంగా 18మంది ఉపాధ్యాయుల నుంచి జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న ఇద్దరు ఎమ్మెల్యేలు, ఓ మహిళా నేత ఒక్కొక్కరి నుంచి రూ.5లక్షలనుంచి రూ.7లక్షల వరకు వసూలు చేశారు. డబ్బులు ఇచ్చిన ఉపాధ్యాయుల పేర్లను సూచిస్తూ సిఫార్సు లేఖలను విద్యాశాఖ మంత్రికి పంపించారు. తమ పార్టీ ఎమ్మెల్యేలను నుంచి రావడం, ఇందులో సామాజికవర్గాలు కూడా ఒకటే కావడంతో వీటికి సదరు మంత్రి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశారు. గురువారం నుంచి రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ఎత్తివేయడంతో శుక్రవారం ఈ దొడ్డిదారి బదిలీల జీవో ఇవ్వడానికి వైసీపీ నేతలు పావులు కదిపారు. కానీ ప్రభుత్వం మారడంతో గురువారం ఈ ఉత్తర్వులను విద్యాశాఖ నిలిపివేసింది. జిల్లాల్లో ఎక్కడా బదిలీలు చేయవద్దని డీఈవోలను ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ గురువారం మెమో నెంబర్ 2272734 జారీ చేశారు. గతంలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులను బదిలీలు చేస్తూ జారీ చేసిన ఐదు మెమోలను సైతం నిలిపివేశారు. దీంతో దొడ్డిదారి బదిలీలు చేయడానికి రూ.కోటి వరకు వసూలు చేసిన వైసీపీ నేతలకు షాక్ తగిలినట్లయింది. అసలే ఎన్నికల్లో ఓడిపోయి తీవ్ర అవమానభారంతో ఇంటినుంచి బయటకు కూడా రావడానికి జంకుతున్న సదరు ఎమ్మెల్యేలకు తాజా ఆదేశాలు మరింత ఇబ్బందికరంగా మారాయి.

ఎంత గుట్టుగా నడిపారో..

తాజా ఉత్తర్వులతో జిల్లాకు చెందిన 18మంది ఉపాధ్యాయులు సిఫార్సు బదిలీలు నిలిచిపోయినట్లయింది. వీరందరికీ పరస్పర బదిలీలతోపాటు ఒక స్థానం నుంచి మరొక స్థానానికి బదిలీ చేస్తూ కేవలం బదిలీ ఉత్తర్వులు మాత్రమే ఇచ్చారు. ఎన్నికల కోడ్ ఎత్తివేసిన అనంతరం బదిలీలు అమలు చేయాలంటూ అప్పట్లో ఉత్తర్వుల్లో పేర్కొనడంతో భౌతికంగా బదిలీలు జరగలేదు. దీంతో కోడ్ గురువారం నుంచి ఎత్తివేస్తుండడంతో తమ బదిలీలకు ఎలాంటి ఢోకాలేదని ఉపాధ్యాయులు భావిస్తున్న తరుణంలో అనూహ్యంగా కొత్త ప్రభుత్వం వాటన్నింటినీ నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సిఫార్సు బదిలీ ఉపాధ్యాయులు జీర్ణించుకోలేకపోతున్నారు. తాజా ఉత్తర్వులు వచ్చాయని తెలిసి లబోదిబోమంటున్నారు. ఇచ్చిన ముడుపుల డబ్బులు ఎలా వసూలు చేసుకోవాలో అర్థంకాక తల పట్టుకుంటున్నారు. ప్రభుత్వం మారడం, తాము సొమ్ములు చెల్లించిన నేతలు మాజీలు కావడంతో వారిపై ఒత్తిడి తెచ్చైనా లక్షల డబ్బును రాబట్టుకోవాలని భావిస్తున్నారు. ఈ మేరకు మధ్యవర్తులుగా వ్యవహరించిన వారి వద్దకు పరుగులు పెడుతున్నారు. వాస్తవానికి ఉపాధ్యాయుల బదిలీల విషయంలో తెలుగుదేశం ప్రభుత్వం గతంలో విప్లవాత్మక మార్పులు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నేతల దయాదాక్షిణ్యాలపై ఉపాధ్యాయ బదిలీలు జరిగేవి. వారిని ప్రసన్నం చేసుకున్న వారికి కోరుకున్న చోటకు పోస్టింగ్ వచ్చేది. పరపతి లేని వారికి అప్రాధాన్య స్థానాలు దొరికేవి. ఈ నేపథ్యంలో వీటన్నిటికీ చెక్ పెడుతూ గతంలో సీఎంగా ఉన్నప్పుడు చంద్రబాబు ఉపాధ్యాయులకు బదిలీల్లో కౌన్సెలింగ్ విధానం ప్రవేశపెట్టారు. దీనిప్రకారం ఉపాధ్యాయులు పనిచేసిన ప్రాంతం, సీనియార్టీని బట్టి వచ్చిన పాయింట్ల ఆధారంగా నచ్చిన ప్రాంతానికి బదిలీ అయ్యే అవకాశం కల్పించారు. దీనికి తూట్లు పొడుస్తూ వైసీపీ నేతలు సిఫార్సు బదిలీలకు తెరలేపి కోట్లలో ముడుపులు వసూలు చేశారు. జిల్లాలో 18మంది టీచర్లనుంచి కోటివరకు వసూలు చేయగా, రాష్ట్రవ్యాప్తంగా 1800 ఉపాధ్యాయుల నుంచి భారీగా నొక్కేశారు.

టీడీపీ అధినేత చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే విజేతలు, జిల్లా నేతలు



చంద్రబాబును కలిసిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్





చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే విజేత సత్యప్రభ, తుని ఎమ్మెల్యే విజేత యనమల దివ్య



చంద్రబాబును కలిసిన పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ



రిక్త'హస్తం'

- అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పూర్తిగా డీలా
- జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో హస్తం పార్టీ అభ్యర్థులకు ఒక్కొక్కరికి 2,500 లోపే ఓట్లు
- 2019 ఎన్నికలతో పోల్చినా ఏమాత్రం పెరగని ఓట్ల శాతం
- పీసీసీ అధ్యక్షురాలిగా షర్మిలరాకతో పార్టీ కొంత పుంజుకుందని ప్రచారం
- అటు జిల్లాల్లోను పర్యటించిన షర్మిల: అయినా ఫలితాల్లో ఫ్ట్
- ఎంపీ అభ్యర్థి పల్లంరాజుకు అత్తెసరు ఓట్లే

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో జిల్లాలో కాంగ్రెస్ బొక్కబోర్లా పడింది. గత ఎన్నికలతో పోల్చితే ఈసారి ఆ పార్టీ అభ్యర్థులకు ఓట్లు పెరుగుతాయని భావించినా పెద్దగా ప్రయోజనం లేకపోయింది. పీసీసీ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల బాధ్యతలు స్వీకరించడంతో ఆ ఊపుతో కొంతైనా పార్టీకి మైలేజీ పెరిగి ఓట్లు వస్తాయని నియోజకవర్గాల అభ్యర్థులు భావించారు. కానీ ఫలితాల్లో ఎక్కడా హస్తం పార్టీ అభ్యర్థులు కనీసం పోటీ ఇవ్వలేకపోయారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో ఎక్కడా ఒక్కో అభ్యర్థికి కనీసం 2,500 ఓట్లు కూడా రాలేదు. దీంతో ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పూర్తిగా చతికిలపడింది. ప్రతిపక్షంగా ఐదేళ్లపాటు పోరాటం చేయకపోవడం, ఆ పార్టీకి జిల్లాలోను, నియోజకవర్గాల్లోను నేతలు పెద్దగా బలమైనవారు లేకపోవడం పెద్ద మైనస్‌గా మారింది. అటు కాంగ్రెస్‌పై జనంలో రాష్ట్రాన్ని ముక్కలు చేశారన్న కోపం ఇంకా చల్లారకపోవడం కూడా ఆ పార్టీ కనీసం పుంజుకోకపోవడానికి ప్రధాన కారణంగా చెబుతున్నారు.

ప్రధానంగా నియోజకవర్గాలవారీగాచూస్తే తునిలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి గేలం శ్రీనివాసరావుకు ఈవీఎం ఓట్లు కేవలం 1,923 పోలయ్యాయి. 15 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పడ్డాయి. నియోజకవర్గంలో పోలైన మొత్తం ఓట్లలో 1.02శాతమే కాంగ్రెస్‌కు దక్కాయి. ఈ నియోజకవర్గంలో 2019 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 1,949 వచ్చాయి. ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి ఎన్.సత్యనారాయణకు ఈవీఎం ఓట్లు 1,345, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 9 వచ్చాయి. మొత్తం ఓట్లలో ఆయనకు వచ్చింది 0.77శాతం ఓట్లు. గత ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్‌కు 3,363 ఓట్లు లభించాయి. జగ్గంపేట అభ్యర్థి శివగణేష్‌కు ఈవీఎం ఓట్లు 1,448, పోస్టల్‌బ్యాలెట్ ఓట్లు 9వచ్చాయి. మొత్తం వచ్చిన ఓట్లశాతం 0.75. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 1,052ఓట్లు లభించాయి. పిఠాపురంలో ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సత్యానందరావుకు ఈవీఎం ఓట్లు 1,222, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 9 వచ్చాయి. ఓట్లశాతం 0.59. గతఎన్నికల్లో ఇక్కడ ఆ పార్టీకి 1,139ఓట్లు వచ్చాయి. పెద్దాపురం అభ్యర్థి తుమ్మల దొరబాబుకు ఈవీఎం ఓట్లు 2,145, పోస్టల్ ఓట్లు 23 వచ్చాయి. ఓట్ల శాతం 1.21. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 1,668ఓట్లు వచ్చాయి. కాకినాడ సిటీ అభ్యర్థికి ఈవీఎం ఓట్లు 2,100, పోస్టల్ ఓట్లు 38 పడ్డాయి. లభించిన ఓట్ల శాతం 1.21. గత ఎన్ని కల్లో ఇక్కడ 3,252 ఓట్లు వచ్చాయి. కాకినాడ రూరల్ అభ్యర్థి పిల్లి సత్యలక్ష్మికి ఈ ఎన్నికల్లో ఈవీఎం ఓట్లు 2,132, పోస్టల్ ఓట్లు 73 లభించాయి. వచ్చిన ఓట్లశాతం 1.07. కాగా గత ఎన్నికల్లో ఇక్కడ హస్తానికి 1,591 ఓట్లు వచ్చాయి. అటు ఎంపీ అభ్యర్థి పల్లంరాజుకు ఈ ఎన్నికల్లో మొత్తం 21,109 ఓట్లు లభించాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 851పడ్డాయి. మొత్తం ఓట్లశాతం 1.59. కాగా గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థికి 8,640 ఓట్లు వచ్చాయి.

ఎన్నికల నియమావళి అమలు నిలుపుదల: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 6: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలును నిలుపుదల చేస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశాలను జారీ చేశారని జిల్లా కలెక్టర్ జె.నివాస్ గురువారం తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈఏడాది మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటినుంచి అమల్లోకి వచ్చిన ఈ ప్రవర్తన నియమావళి జూన్ 4న ఓట్ల లెక్కింపు ముగిసిన తదుపరి 48 గంటలు వరకు అమల్లో ఉందన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడినందున రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ పూర్తిగా ముగియడంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును నిలుపుదల చేశారని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలును గురువారం సాయంత్రం నుంచి నిలుపుదల చేస్తున్నట్లు సీఈవో జారీ చేసిన ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయన్నారు.

బిల్లు కలెక్టర్‌పై గుర్తుతెలియని వ్యక్తుల దాడి 7వ

9 పరిశోధనా ప్రాజెక్టులకు నిధుల విడుదల 7వ

నూతన ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు: ఏపీఎన్జీవో అసోసియేషన్

కాకినాడ సిటీ, జూన్ 6: ఉద్యోగులు, ప్రజాతీర్పుతో ఏర్పాటు కాబోతున్న నూతన ప్రభుత్వానికి, ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడుతున్న చంద్రబాబుకు ఏపీఎన్జీవో అసోసియేషన్ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా శాఖ అధ్యక్షుడు జి.రామ్మోహనరావు, జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ అన్నారు. కాకినాడలోని ఏపీఎన్జీవో హోంలో అసోసియేషన్ నాయకులు గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు రామ్మోహన రావు, వెంకటకృష్ణ మాట్లాడుతూ నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపాలని, ప్రజా ఆకాంక్షలు నెరవేర్చే దిశగా పాలన సాగిస్తూ అభివృద్ధి పథంలో నడపాలని కోరారు. ఉద్యోగుల సమస్యలు, వారి ప్రతిపాదనలు, సానుకూలంగా పరిష్కరించి మానవతను చాటుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, సీపీఎస్ రద్దుకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. నూతన ప్రభుత్వం ఉద్యోగులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, నిష్పక్షపాత పారదర్శకతను పాటించేలా ఉండాలన్నారు. ప్రధానంగా ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ కార్డులు పనిచేసే విధంగా, అర్హులకు సంబంధిత పథకం ప్రయోజనం అందేలా చూడాలన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలని, తమతోపాటు విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆర్థిక భద్రతను దృష్టిలో ఉంచుకుని పాలనా సంబంధ నిర్ణయాలు తీసుకోవాలని ఆకాంక్షించారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసు, జిల్లా సహా అధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు పాలపర్తి మూర్తిబాబు, సరెల్ల చంద్రరావు, పి.రాజబాబు, కేవీఎస్‌వీ ప్రసాద్, పి.పాండురంగారావు, కోశాధికారి వై.పద్మమీనాక్షి పాల్గొన్నారు.

పశుగ్రాసం దొరక్క మూగజీవాల విలవిల



గ్రామాలలో ఎండుగడ్డికి ఎన్ని కష్టాలో..

అల్లాడుతున్న పశువులు

కొండెక్కిన గడ్డి ధరలు

ఇబ్బందులు పడుతున్న పశుపోషకులు



సామర్లకోట, జూన్ 6: పశుగ్రాసం దొరక్క మూగజీవాల డొక్కలు ఎండుతున్నాయి. ఎండలు ముదరడంతో పచ్చగడ్డి కరువైంది. ప్రత్యామ్నాయమైన వరిగడ్డి ధరలు ఆకాశన్నంటుతున్నాయి. దీంతో సరైన పోషణ లేక పాల దిగుబడి తగ్గి పశు పోషకులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని మెట్ట ప్రాంతాలలో పరిస్థితి మరీ దారుణంగా మారింది. కొండలు, గుట్టలు, గరువులు వంటి బీడు భూములలో మేత దొరకక పశువులు అల్లాడుతున్నాయి. తప్పని పరిస్థితుల్లో పశు పోషకులు దూరాభారమైనా మాగాణీ ప్రాంతాలకు వెళ్లి ఎండుగడ్డిని కొనుగోలు చేయాల్సి వస్తుంది. గత పాలకుల హయాంలో పశుగ్రాస క్షేత్రాలను ఏర్పాటు చేసి అటు రైతులకు, ఇటు పశు పోషకులకు గ్రాసం కొరత లేకుండా ముందుచూపుగా వ్యవహరించిందన్న పేరుందని పలువురు రైతులు చెబుతున్నారు. అంతే కాదు అప్పట్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి పొరుగు రాష్ట్రాలకు సామర్లకోట, బిక్కవోలు రైల్వే గూడ్స్ యార్డుల ద్వారా ఎండుగడ్డిని సరఫరా చేసిన ఖ్యాతి అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఉందని పలువురు పశు పోషకులు నాటి మంచి రోజులను గుర్తు చేసుకోవడం గమనార్హం. కానీ ప్రస్తుత ప్రభుత్వంలో ఆ దిశలో చేసిన దాఖలాలు లేవు. దీంతో ఎండుగడ్డికి గడ్డు పరిస్థితి నెలకొంది.

అధిక ధరలకు వరిగడ్డి

ఇతర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ట్రాక్టర్లలో వరిగడ్డిని సామర్లకోట తదితర ప్రాంతాలకు తెచ్చి ట్రాక్టర్ వరిగడ్డి రూ. 13 వేల నుంచి రూ. 15 వేల వరకూ ధరలు నిర్ణయించడంతో రైతులు అధిక ధరలతో కొనుగోలు చేసుకోలేక గగ్గోలు పెడుతున్నారు. అధికారులు ధరలను నియంత్రించకుండా ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు రైతుల నుంచి వినవస్తున్నాయి. ఇతర జిల్లాల నుంచి సైతం లారీలలో వరిగడ్డిని తెచ్చి లారీ వరిగడ్డిని రూ. 18 వేల నుంచి రూ. 20 వేల వరకూ విక్రయిస్తున్నారు. సామర్లకోట, పెద్దాపురం, కిర్లంపూడి, పెదపూడి తదితర ప్రాంతాలలో పశుగ్రాసం కొరత తీవ్రంగా ఉండడంతో పశుపోషకులు, రైతులు వరిగడ్డిని కొనుగోలు చేసుకునేందుకు ఆసక్తిని కనబరుస్తూ వరిగడ్డి ట్రాక్టర్ల కోసం గాలింపు చర్యలు చేస్తున్నారు. దీన్ని ఆసరాగా తీసుకుని వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ట్రాక్టర్ వరిగడ్డికి కనీసం రూ. 500 కూడా తగ్గించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో మేత కోసం ఉదయం నుంచీ సాయంత్రం వరకూ పొలాల వెంబడి తిరిగినా మూగజీవాలకు సరిగ్గా మేత దొరకడం లేదని దీంతో బక్కచిక్కి పశువులు అల్లాడిపోతున్నాయని పశు పోషకులు అంటున్నారు. రాయితీలపై పశు పోషకులకు గత ప్రభుత్వ హయాంలో పశుగ్రాసం రైతులకు సరఫరా చేసేవారు. గత నాలుగేళ్లుగా ప్రభుత్వంలో పశుగ్రాసం రైతులకు రాయితీలపై సరఫరా చేసిన దాఖలాలు లేవని పలువురు పశు పోషకులు వాపోతున్నారు. ప్రభుత్వం మూగజీవాల పశుగ్రాసం విషయంలో ఎటువంటి పురోభివృద్ధి లేకపోవడం అత్యంత విచారకరం అని పలువురు ఆరోపిస్తున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో వ్యాపారులు చెప్పిన ధరకే పశుగ్రాసాన్ని కొనుగోలు చేయాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. వరిగడ్డి అధిక ధరలకు విక్రయాలు జరుపుతున్నా అధిక ధరలను నియంత్రించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శిస్తున్నారు. ప్రస్తుత వేసవి కాలంలో పశు సంపదను కాపాడేందుకు ప్రభుత్వం, అధికారులు యుద్ధ ప్రాతిపదికన రాయితీపై పశుగ్రాసాన్ని అందజేయాలని పలువురు పశు పోషకులు కోరుతున్నారు.

జీఎస్ఎల్‌లో నేడు, రేపు యుక్త శస్త్ర చికిత్స కోర్సుపై వర్క్‌షాప్

రాజానగరం, జూన్ 6: భారతదేశంలోనే తొలిసారిగా రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో యుక్త శస్త్ర చికిత్స (ఫండమెంట్ యూస్ ఆఫ్ సర్జికల్ ఎనర్జీ(ఫ్యూజ్) కోర్సుపై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్టు జీఎస్ఎల్ మెడికల్ కళాశాల సర్జన్ ప్రొఫెసర్, నిర్వహణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ గన్ని భాస్కరరావు గురువారం తెలిపారు. అమెరికన్ గ్యాస్ట్రో ఇంటెస్టియనల్, ఎండోస్కోపిక్ సర్జన్స్ సొసైటీ (ఎస్ఏజీఈఎస్), యూఎస్ఏ ద్వారా ఆమోదించబడిన ఈ ప్రాథమిక కోర్సుకు లైఫ్ టైమ్ సర్టిఫికెట్ అందిస్తుందని చెప్పారు. ఇది అన్ని విభాగాల సర్జన్లకు, సర్జరీ పీజీ విద్యార్థులకు ఒక ముఖ్యమైన విద్యా అవకాశమని అన్నారు. ఈ నెల 7,8 తేదీల్లో జరిగే ఈ వర్క్‌షాప్‌లో ఫ్యూజ్ కోర్సు శస్త్ర చికిత్సలో ఎనర్జీ ఆధారిత పరికరాల సురక్షిత వినియోగంపై ఐదుగురు అమెరికన్ సర్జన్లు సమగ్ర శిక్షణ అందిస్తారన్నారు. శిక్షణ పొందిన వారు ఎలక్ట్రో సర్జరీ ప్రాథమిక అంశాలు, ఆపరేటింగ్ రూమ్ అగ్ని ప్రమాదాలు వంటి ప్రతికూల సంఘటనలకు అవకాశాలు, నివారించే పద్ధతులు, వివిధ శస్త్ర చికిత్స విభాగాల్లో ఉపయోగించే ఎనర్జీ పరికరాలు గురించి సమగ్ర అవగాహన పొందుతారని చెప్పారు. ఇది భారతదేశంలో శస్త్ర చికిత్స విద్యలో ఒక ముఖ్యమైన పురోగతిగా నిలుస్తుందన్నారు. దీనిలో పాల్గొనే వారికి శస్త్ర చికిత్సలో ఎనర్జీ పరికరాల సురక్షిత వినియోగంపై తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవడానికి అవకాశం లభిస్తుందని, అలాగే రోగుల ఫలితాలు, శస్త్ర చికిత్స రంగాన్ని అభివృద్ధి చేస్తుందని డాక్టర్ భాస్కరరావు వివరించారు. మరిన్ని వివరాలు, నమోదు కోసం డాక్టర్ సమీర్ రంజన్‌నాయక్ 95505 21218; డాక్టర్ అన్నపూర్ణ 98854 46606, డాక్టర్ ఆనంద్ 89390 63510 నెంబర్లలో సంప్రదించవచ్చని చెప్పారు.

బిల్లు కలెక్టర్‌పై గుర్తుతెలియని వ్యక్తుల దాడి



చెల్లాచెదురుగా కుర్చీలు

సర్పవరం జంక్షన్, జూన్ 6: కాకినాడ రూరల్ సర్పవరం గ్రామ సచివాలయంలో ఆగంతకులు కర్రలతో వచ్చి బిల్లు కలెక్టర్‌పై దాడి చేయడమే కాకుండా ఆఫీసులో ఫర్నీచర్ ధ్వంసం చేస్తూ తీవ్ర భయాందోళన సృష్టించారు. సచివాలయం-1లో బిల్లు కలెక్టర్‌గా శేషగోపాల్ విధి నిర్వహణలో ఉండగా మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ముగ్గురు వ్యక్తులు ఆఫీసులోకి చొరబడ్డారు. వచ్చీ రాగానే ఎదురుగా ఉన్న బిల్లు కలెక్టర్ శేషగోపాల్‌పై ఓ వ్యక్తి దాడికి పాల్పడి పిడిగుద్దులు కురిపించారు. మరో వ్యక్తి కుర్చీలు విరగ్గొట్టి ఫర్నీచర్ ధ్వంసం చేశాడు. మూడో వ్యక్తి బయట నిలబడి ఈ తతంగం మొత్తం వీడియో తీస్తున్నాడు. ఏం జరిగిందో తేరుకునేలోగా దాడి చేశారు. అక్కడే ఉన్న గ్రామ కార్యదర్శి సత్యనారాయణ మూర్తి, సచివాలయం, శానిటేషన్ సిబ్బంది అడ్డుకోబోగా వీరిపై తిరగబడి కర్రలతో కొట్టేందుకు ప్రయత్నించారు. వీడియో తీయబోయిన సిబ్బందిని బెదిరించి పరారయ్యారు. బిల్లు కలెక్టర్ శేష కుమార్ తనపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారంటూ సర్పవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ దాడి చేసిన వారు ఎవరో, ఎందుకు చేశారో వివరాలు తెలియవని, వీరిని చూస్తే గుర్తుపట్టగలమని గ్రామ కార్యదర్శి సత్యనారాయణమూర్తి, బాధితుడు శేషగోపాల్ తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి రాగా ఆగంతకులు అప్పటికే పరారయ్యారు. బాధితుని ఫిర్యాదు మేరకు వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సర్పవరం ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. సర్పవరం ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్ మాట్లాడుతూ సచివాలయం పరిసర ప్రాంతాల్లో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

లోవ హుండీ ఆదాయం రూ.35.22 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

తునిరూరల్, జూన్ 6: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో హుండీల లెక్కింపు గురువారం చేపట్టారు. ఈ లెక్కింపునకు దేవదాయ ధర్మదాయ శాఖ నుంచి ప్రత్యేకాధికారి పి.నారాయణ మూర్తి హాజరుకాగా ఆలయ సిబ్బంది హుండీలు తెరిచి లెక్కింపులు చేపట్టారు. 42 రోజులకుగాను రూ.35,22,980 లక్షలు ఆదాయం ఆలయానికి సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.విశ్వనాథరాజు తెలిపారు. ఈ లెక్కింపును జిల్లా సహాయ కమిషనర్ జె.సత్యనారాయణ, గ్రేడ్-2 కార్యనిర్వహణాధికారి కేవీ సురేష్‌లు పర్యవేక్షించారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి



గొల్లప్రోలు రూరల్, జూన్ 6: గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరంలో పిడుగుపాటుకు వ్యక్తి మరణించగా పోలీసులు గురువారం గుర్తించారు. గ్రామానికి చెందిన పోసిన వీరవెంకట సత్యనారాయణ(34) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఖాళీ సమయాల్లో పశువులను మేపుతూ ఉంటారు. బుధవారం సాయంత్రం అదే మాదిరిగా రెండు గేదెలను మేపేందుకు వెళ్లాడు. రాత్రయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువులు, కుటుంబసభ్యులు వెతకడం ప్రారంభించారు. ఊరి చివరి చెరువు వద్ద విగత జీవిగా పడి ఉన్న సత్యనారాయణను బంధువులు, పోలీసులు గుర్తించారు. పిడుగుపాటుకు గురై మరణించినట్లు నిర్ధారించారు. గొల్లప్రోలు ఎస్ఐ బాలాజీ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సత్యనారాయణకు వివాహం కాలేదు. ఇతనికి తల్లి, ఇద్దరు సోదరీమణులు ఉన్నారు.

ఆందోళనలో ‘షెకావత్’ బృందం

వైసీపీతో అంటకాగి సాగించిన అక్రమాలకు మూల్యం తప్పదన్న వేదన

ఇప్పటికే ప్రభుత్వం వద్ద నివేదికలకు అడ్డు నిలిచే వారి కోసం గాలింపు

క్రమశిక్షణా చర్యలకు గురైన వారు పెదవి విప్పకుండా జాగ్రత్తలు

(ఆంధ్రజ్యోతి-నిఘా విభాగం)

మారేడుమిల్లి అడవుల్ని అడ్డాగా చేసుకుని వైసీపీతో అంటకాగిన షెకావత్ బృందం, వీరికి అండగా నిలిచిన మరికొందరు కేంద్ర సర్వీసుల అధికారులు రాష్ట్రంలో పాలన మారడంతో తమకు గడ్డు రోజులు వచ్చాయన్న ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వంలో తాము సాగించిన అక్రమాలపై ఇప్పటికే ప్రభుత్వం వద్ద నివేదికలు పెండింగ్‌లో ఉండటం, ఎన్నికల కోడ్ కారణంగా ప్రభుత్వంలో రాజకీయ పెద్దలు ఎవరూ లేకపోవడం, ఎన్నికలు అయ్యాక తిరిగి తమ పెద్దలే అధికారంలోకి వస్తారన్న ధీమాలో ఉన్న షెకావత్ తరహా అధికారులు, వారి బృందాలు తాజా పరిణామాలతో విస్మయానికి గురయ్యారు. చిత్తూరు జిల్లాకు చెందిన అటవీశాఖలో కీలకంగా ఉన్న వైసీపీ ప్రజాప్రతినిధి అండతోనే స్థానిక నేతల నుంచి ఇబ్బందులు లేకుండా చేసుకుని ఇంతకాలం చక్రం తిప్పిన ఈ అధికారులు కొత్త ప్రభుత్వంతో తమకు గడ్డురోజులు వచ్చి మూల్యం చెల్లించుకోక తప్పదన్న ఆవేదనకు గురవుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పట్టా భూముల్లో విలువైన కలప సంపదను సులభంగా పట్టుకుపోవడంతో పాటు, అటవీ శాఖకు చెందిన టేకు ప్లాంటేషన్లపై కూడా ఈ అక్రమార్కుల కళ్లు పడ్డాయి. ఇందుకు మారేడుమిల్లి అటవీ రేంజ్‌ను ఎంచుకున్నారు. ఈ రేంజ్ పరిధిలో 1963 కాలం నుంచి ఉన్న పురాతన టేకు ప్లాంటేషన్లు ఉండటంతో, ఇక్కడ ఏం చేసినా బయటపడే అవకాశాలు ఉండవన్న ధీమాతో వందలాదిగా టేకు చెట్లను నరికేశారు. కొన్ని తరలించుకుపోగా, కొన్నిటిని అక్కడే వదిలేశారు. ఈ బాగోతం మీడియాలో వెలుగు చూడటంతో అటవీ శాఖ ఉన్నతాధికారులు విచారణ జరిపించి నివేదికలను ప్రభుత్వానికి పంపించారు. నివేదికలపై చర్యలు తీసుకునే సమయానికి రాజకీయ పాలన లేకపోయినా, దానిపై చర్యలను తమ ప్రభుత్వం వచ్చాక చూసుకోవచ్చన్న ధీమాతో కోల్డ్‌స్టోరేజ్‌లో పెట్టేలా మాత్రం చేసుకోగలిగారు. అయితే తీరా తమకు అనుకూలంగా ఉండే ప్రభుత్వం రాకపోవడంతో ఏం జరుగుతుందో అన్న ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా షెకావత్ మాటలు నమ్మి ఆయనకు అనుకూలంగా వ్యవహరించి, ఆయన భరోసాతో అడవిలో జరిగిన నష్టానికి బాధ్యులుగా తెరకెక్కి, క్రమశిక్షణా చర్యలకు గురైన వారికి భరోసా సన్నగిల్లుతోంది. ఈ పరిస్థితుల్లో వారు అభద్రతకు గురై తమ ఉద్యోగాలను నిలుపుకునే లక్ష్యంతో మారేడుమిల్లి అడవిలో జరిగిన బాగోతంలో వారు అప్రోవర్లుగా మారిపోతే జరిగే పరిణామాలు ఎటు దారి తీస్తాయోనన్న ఆందోళన కూడా వారిని వెంటాడుతోంది. దీంతో వారు పెదవి విప్పకుండా మరింత భరోసా కల్పిస్తూ ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వారిని కాపాడే దిశగా కొత్త ప్రభుత్వంలో సరైన వారి కోసం ఈ బృందం అధికారులు అన్వేషిస్తున్నారు.

సచివాలయం నుంచి మెటీరియల్ తరలింపు

చీకట్లో సచివాలయ భవన మెటీరియల్ తరలించిన వైసీపీ నాయకుడు

మెటీరియల్‌ను తరలిస్తున్న రేషన్ వాహనాన్ని అడ్డుకున్న జన సైనికులు



వాహనాన్ని అడ్డుకున్న దృశ్యం

కరప, జూన్ 6: కరప-పేపకాయపాలెం రోడ్డులో నిర్మాణంలో ఉన్న ఒక సచివాలయ భవనం నుంచి స్థానిక వైసీపీ నాయకుడు మెటీరియల్ తరలించడం వివాదాస్పదమయ్యింది. గురువారం సాయంత్రం చీకటి పడ్డాక రేషన్ వాహనంపై గుట్టుచప్పుడు కాకుండా ఈ మెటీరియల్ పట్టుకెళ్లిపోతుండగా పలువురు జనసైనికులు అడ్డుకున్నారు. స్థానిక సూర్యవరహ లేఅవుట్ ఎదురుగా సచివాలయం-2 భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. గుత్తేదారుడైన స్థానిక వైసీపీ నాయకుడు భవనంలో ఉంచిన పలు రెడీమేడ్ కిటికీలు, ఫ్రేమ్‌లను రేషన్ వాహనంలోకి ఎక్కించి తరలించుకుపోయాడు. మరో ట్రిప్పు తరలిస్తుండగా అనుమానం వచ్చిన జనసేన కార్యకర్తలు వాహనాన్ని అడ్డుకుని పంచాయతీ కార్యదర్శికి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. అధికారులెవరూ లేకుండా చీకట్లో మెటీరియల్‌ను ఎందుకు పట్టుకెళుతున్నారని, రేషన్ సరుకులకు వినియోగించాల్సిన వాహనంలో తరలించే అధికారం మీకెవరిచ్చారని జనసైనికులు యాళ్ల పండు, పేపకాయల అంజి, కశిలింక సతీష్ తదితరులు ప్రశ్నించారు. వాహనంలో ఎక్కించిన సరుకును దింపించి భవనంలో పెట్టించారు. ముందు పట్టుకెళ్లిన సరుకును కూడా తీసుకువచ్చి ఇక్కడ పెట్టాలని, పాడైపోతాయనే ఉద్దేశమే ఉంటే అధికారుల సమక్షంలో రేపు తీసుకెళ్లాలని జనసైనికులు పట్టుబట్టారు. దీంతో చేసేదిలేక కాంట్రాక్టర్ అనుచరుడు, రేషన్ వాహనం డ్రైవర్ అక్కడ నుంచి వెనుదిరిగారు. పంచాయతీ కార్యదర్శి నాగేంద్రకుమార్ ఘటనాస్థలికి చేరుకుని పీవీసీ కిటికీలు, ఫ్రేమ్‌లు, ఇతర సామగ్రిని పరిశీలించారు. ఈ సామగ్రిని తరలించిన వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

అడ్వెంచర్ అవార్డుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

సర్పవరం జంక్షన్, జూన్ 6: భారత యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ 2023 ఏడాదికి టెన్జింగ్ నార్గే నేషనల్ అడ్వెంచర్ అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్రాజ్ సీఈవో ఏవీఎస్ఎన్ మూర్తి ఓ ప్రకటనలో కోరారు. 2021 నుంచి 2023 సంవత్సరాల్లో భూమి, సముద్రం, గాలిపై సాహస కార్యక్రమాల్లో అత్యుత్తమ విజయాలు సాధించిన అభ్యర్థుల నుంచి దరఖాస్తుకు అర్హులన్నారు. అవార్డు గ్రహీతలకు టెన్జింగ్ నార్గే సంస్థ విగ్రహంతో పాటు ప్రశంసా పత్రం, రూ.15 లక్షల నగదు బహుమతి అందించనున్నట్లు చెప్పారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 14వ తేదీలోపు జ్ఞిజఐఖ్రీటఛీటజౌ౨.జీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలని కోరారు. సాహస కృత్యాల వివరాలతో ఈనెల 10వ తేదీ లోపు సెట్రాజ్ రమణయ్యపేట జిల్లా యువజన సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాలని, వీరి అర్హతలను పరిశీలించిన అనంతరం ఏపీ ప్రభుత్వానికి సిఫార్సు చేయనున్నట్లు చెప్పారు. వివరాల కోసం సెట్రాజ్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

టీటీ ర్యాంకింగ్ పోటీలు

పెద్దాపురం, జూన్ 6 : స్థానిక శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో ఈనెల 8 నుంచి రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. ఈనెల 8,9,10 తేదీల్లో మూడు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఏపీటీటీఏలో నమోదైన క్రీడాకారులు మాత్రమే ఈ ర్యాంకింగ్ పోటీలకు అర్హులన్నారు. ఈ పోటీలు మెన్, ఉమెన్, బాలుర విభాగాల్లో ఉంటాయన్నారు. బాలుర విభాగంలో అండర్ 19, 17, 15, 13, 11తో పాటు, మహిళ, బాలికల విభాగంలో అండర్ 19, 17, 15, 13, 11 డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో జరుగుతాయన్నారు.

మల్లాడి కృష్ణారావు జన్మదిన వేడుకలు



పుట్టినరోజు వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేస్తున్న మల్లాడి కృష్ణారావు

యానాం, జూన్ 6: పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు 61వ పుట్టినరోజును స్థానిక యర్రా గార్డెన్స్‌లో మల్లాడి అభిమాన సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగసామి, హోం మంత్రి నమశ్శివాయ, ప్రజా పనుల శాఖ మంత్రి లక్ష్మీనారాయణ, స్పీకర్ సెల్వం, పలువురు పుదుచ్చేరి ఎమ్మెల్యేలు యానాం వచ్చారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన దాట్ల సుబ్బరాజు (ముమ్మిడివరం), పంతం నానాజీ (కాకినాడ రూరల్), రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాస్‌చంద్రబోస్, పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ముఖ్యమంత్రి సమక్షంలో మల్లాడి భారీ కేక్ కట్ చేశారు. మల్లాడి స్వగృహంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ప్రవచనం అనంతరం ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు మల్లాడి దంపతులను ఆశీర్వదించారు. వందలాదిగా అభిమానులు మల్లాడికి గజమాలలు వేసి పుష్పగుచ్ఛాలు అందించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

శనేశ్వర ఆలయానికి పోటెత్తిన భక్తులు

అమావాస్య సందర్భంగా తైలాభిషేకాలు



తైలాభిషేకాలు నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపేట, జూన్ 6: కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లి శనేశ్వర (మందేశ్వర) స్వామి వారి ఆలయంలో గురువారం అమావాస్యను పురస్కరించుకుని తైలాభిషేకాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి సర్వదర్శనానికి, తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తైలాభిషేకాల ద్వారా రూ.1,33,075 ఆదాయం వచ్చింది. అన్నదాన పథకానికి పట్టిసీమకు చెందిన సత్యనారాయణగుప్తా రూ.10,120 విరాళం ఇచ్చినట్టు ఆలయ సహాయ కమిషనరు, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు.

9 పరిశోధనా ప్రాజెక్టులకు నిధుల విడుదల

జేఎన్టీయూకే, జూన్ 6: రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ (రూసా) 2.0లో భాగంగా కాకినాడ జేఎన్టీయూకే విశ్వవిద్యాలయానికి 9 పరిశోధనా ప్రాజెక్టులకు నిధులు విడుదలైనట్లు జేఎన్టీయూకే ఉప కులపతి జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. వర్సిటీలో పరిశోధనలపై దృష్టి కేంద్రీకరించడం ద్వారా రీసెర్చ్ ప్రాజెక్టులకు నిధులు మంజూరయ్యాయన్నారు. వర్సిటీలోని సెనేట్ హాల్లో గురువారం నిర్వహించిన సమావేశంలో వీసీ మాట్లాడుతూ ఏపీ రాష్ట్ర రూసా ప్రాజెక్టు డైరెక్టరేట్‌కు జేఎన్టీయూకే ద్వారా రూ.93 లక్షల విలువైన 9 పరిశోధనా ప్రాజెక్టులకు వివరణాత్మక ప్రాజెక్టు రిపోర్ట్ (డీపీఆర్) నివేదించగా పరిశోధన, ఆవిష్కరణ, నాణ్యతా మెరుగుదలకు మొదటి విడతలో భాగంగా రూ.40,92,000 నిధులు విడుదల కాగా ఇది మంజూరైన మొత్తంలో 44 శాతం నిధులుగా పేర్కొన్నారు. రీసెర్చ్ ఇన్నోవేషన్ ప్రాజెక్టులకు సంబంధించి వర్సిటీకి మంజూరైన ప్రాజెక్టులకు ప్రసాదరాజు, శ్రీనివాసులు, బీటీ కృష్ణ, పద్మప్రియ, శ్రీనివాసరావు, స్వామినాయుడు, వకుళ, నీలిమాదేవీ, జయప్రసాద్ తదితరులు 9 పరిశోధనా ప్రాజెక్టులకు ప్రధాన పరిశోధకులుగా వ్యవహరిస్తారని రూసా సమన్వయకర్త స్వరూపారాణి తెలిపారు. రెండేళ్ల ప్రాజెక్టులు మంజూరు చేసినట్లు చెప్పారు.

తిరుమల మొక్కు తీర్చుకున్న యువకులు



మొక్కు తీర్చుకున్న యువకులు

మండపేట, జూన్ 6: రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి రావాలని, చంద్రబాబునాయుడు సీఎం కావాలని, మండపేట ఎమ్మెల్యేగా వేగుళ్ల జోగేశ్వరరావు నాలుగోసారి గెలుపొందాలని కోరుతూ మండలంలోని ద్వారపూడికి చెందిన నలుగురు యువకులు తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామికి మొక్కుకున్నారు. కోరిక నెరవేరడంతో టీడీపీ కార్యకర్తలు తాణంకి చంద్రశేఖర్, శివ, వెన్నెల ప్రసాద్, బీజేపీ నాయకుడు కంకటాల మురళీకృష్ణ మెట్ల మార్గంలో నడుచుకుంటూ తిరుమల వెళ్లి గురువారం శ్రీవారికి మొక్కు తీర్చుకున్నారు. స్వామి దయతోనే రాష్ట్రంలో అరాచక పాలన అంతమైందన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ సారథ్యంలో ఏపీ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, మండపేట ఎమ్మెల్యేగా నాలుగోసారి విజయం సాధించిన జోగేశ్వరరావుకు మంత్రివర్గంలో చోటు దక్కాలని కోరుకున్నామని చెప్పారు.

కౌలు రైతులపై చిన్నచూపు



ప్రభుత్వ పథకాలకు దూరంగా..

సాయం అందక రైతుల ఇబ్బందులు

సామర్లకోట, జూన్ 6: భూయజమానులకు పట్టం కడుతూ పాలకవర్గాలు కౌలు రైతులను మాత్రం చిన్నచూపు చూస్తున్నాయి. రూ.2 లక్షల రుణమాఫీ పథకాన్ని అమలు చేసేందుకు పలు దఫాలు ప్రకటనలు గుప్పిస్తున్న నేపథ్యంలో ఆ పథకాలను కౌలు రైతులకు కూడా వర్తింపచేయాలని వినతులు కౌలు రైతుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. సాగుకోసం పలువురు కౌలు రైతులు బ్యాంకుల్లో వడ్డీలకు అప్పులు తెచ్చి అవస్థలు పడుతున్నారు. అయితే వారికి రుణమాఫీ అమలుపై ఎలాంటి స్పష్టత లేకపోవడంతో కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు.

అధిక వడ్డీలతో కుదేలు..

రాష్ట్రంలో కౌలు రైతుల రక్షణ చట్టం ప్రకారం కౌలు రైతులకు బ్యాంకుల నుంచి రుణాలు పొందే హక్కు కలిగి ఉన్నారు. కాగా ఏ బ్యాంకులూ రుణాలు కౌలు రైతులకు ఇచ్చేందుకు ముందుకు రాకపోగా కౌలు రైతుల యోగక్షేమాలు చూసే వ్యవసాయాధికారులు సైతం క్షేత్రస్థాయిలో ఎటువంటి సాయం అందివ్వకపోవడంతో కౌలు రైతులు రుణాలు పొందలేని దుస్థితి ప్రతీ సీజన్‌లోనూ వెన్నాడుతోంది. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అందకపోవడంతో అధిక వడ్డీలకు నగదు తీసుకుని పంట సాగు చేస్తున్నారు. తీరా ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయి పంట కోసం తెచ్చిన అప్పులు తీర్చలేక దిక్కుతోచని స్థితిలో కౌలు రైతులు తలలు పట్టుకుంటున్నారు.

భూ యజమానులకే అందలం

ప్రభుత్వం ఇప్పటివరకూ కౌలు రైతులను గుర్తించకపోవడంతో వ్యవసాయపరంగా అనేక పథకాలకు వారు దూరమవుతున్నారు. రైతుబంధు పథకం భూమి ఉన్న రైతులకే ప్రభుత్వం ఇస్తుండడంతో కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. భూమి ఉన్న రైతులకు రైతుబంధుతో పాటు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలు మాఫీ చేస్తున్నారు. భూమి దున్నే కౌలు రైతులకు ఆదరణ లేకపోవడం, కౌలు కూడా రెట్టింపులు కావడంతో వారి పరిస్థితి దారుణంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం కౌలు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కౌలు రైతులకు రుణాలు అందజేయాలని కౌలు రైతులు కోరుతున్నారు. ఇక నుంచి ప్రభుత్వం కౌలు రైతులకు అందజేస్తున్న సీసీఆర్సీ కార్డుల ద్వారా పంట రుణాలను అందజేయాలని, రుణమాఫీలో కౌలు రైతులను పరిగణనలోకి తీసుకోవాలని పలువురు కౌలు రైతులు వేడుకుంటున్నారు.

రైతు బీమా వర్తింపజేయాలి

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేసి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉంది. కౌలు రైతులకు రుణాలు అందించాలి. రైతు బీమా అందేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం కౌలు రైతుల కోసం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి.

తలారి పోతురాజు, కౌలు రైతు, హుస్సేన్‌పురం, సామర్లకోట మండలం

భక్తిభావంతో ముందుకు సాగాలి

టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు అధికారి ఆనందతీర్థాచార్యులు

ఆలమూరు, జూన్ 6: ప్రతి ఒక్కరూ భక్తిభావంతో ముందుకు సాగితే ముక్తిమార్గం లభిస్తుందని టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు అధికారి ఆనందతీర్థాచార్యులు అన్నారు. మండలంలోని గుమ్మిలేరులో దాస సాహిత్య భక్తి మండలి శిక్షణ తరగతులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దాస సాహిత్యంతో పురందరదాసు సామాన్య ప్రజలకు సైతం అర్థమయ్యేలా ఎన్నో గొప్ప గీతాలను రచించారని, వాటిని ఆలపించే భాగ్యం మనకి దక్కిందని చెప్పారు. భక్తి మండలి సభ్యులు గీతాలను ఆలపించే విధానం, భక్తిభావంతో ఏ విధంగా మెలగాలి అన్న విషయాలను ఆనందతీర్థాచార్యులు వివరించారు. ఆలమూరు అయ్యప్పస్వామి ఆలయ వ్యవస్థాపకుడు పి.ముకుందేశ్వరస్వామి, గుమ్మిలేరు గ్రామస్తులు పాల్గొన్నారు. తొలుత గ్రామంలో వేంకటేశ్వరస్వామి గీతాలను ఆలపిస్తూ భారీ ఊరేగింపు నిర్వహించారు.

16న తిరుపతిలో కవితోత్సవం

అంతర్వేది, జూన్ 6: తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో ఈ నెల 16న అంతర్జాతీయ సాహితీ సంస్థ, శ్రీశ్రీ కళా వేదిక డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్స్ వెల్ఫేర్-కల్చరల్ ఎఫైర్స్ సంయుక్త ఆధ్వర్యంలో కవితోత్సవం పేరిట జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ పేర్కొన్నారు. 165 మంది కవులు పాల్గొంటారన్నారు.

వైభవంగా గ్రామదేవతల జాతర మహోత్సవాలు

కాకినాడ రూరల్, జూన్ 6: రూరల్‌మండలం చీడిగలోని మర్లమ్మతల్లి, ఇంద్రపాలెంలోని నేరేళ్లమ్మతల్లి జాతర మహోత్సవాలను 2రోజులపాటు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా గురువారం గ్రామదేవతల తీర్థాన్ని నిర్వహించగా ఇరుగ్రామాలతోపాటూ చుట్టుప్రక్కల గ్రామాల్లోని భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గ్రామదేవతలను కాకినాడ రూరల్ జనసేన, టీడీపీ నాయకులు పంతం సందీప్, కటకంశెట్టి బాబీ తదితరులు దర్శించుకున్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట



గండేపల్లి : జ్యోతుల నెహ్రూను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు



కాకినాడ: కొండబాబును శాలువతో సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న నాయకులు



పెద్దాపురం : ఎమ్మెల్యే విజేత రాజప్పను సత్కరిస్తున్న దేవదాయశాఖ అధికారులు

విజేతలకు అభినందనల వెల్లువ

- కూటమి విజయంతో కార్యకర్తల సంబరాలు
- ఆలయాల్లో పూజలు, సత్కారాలు
- కొండబాబు ఇంటి వరకు విజయోత్సవ ర్యాలీ

కాకినాడ సిటీ, జూన్ 6: కాకినాడ సిటీ ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో వనమాడి కొండబాబు గెలుపొందిన సందర్భంగా 10వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి చోడిపిల్లి సతీష్ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ గురువారం నిర్వహించారు. దుమ్ములపేటలో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఈ ర్యాలీని ప్రారంభించారు. డెయిరీఫారమ్, కల్పన సెంటర్, మెయిన్‌రోడ్, జగన్నాథపురం వంతెన మీదుగా కొండబాబు ఇంటి వద్దకు చేరుకున్నారు. తీన్‌మార్ డప్పులు, డీజే సౌండ్స్ డాన్స్ లేస్తూ కొండబాబును గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మేరుగు రాజన్న, గంట నూకరాజు అనుసూరి శ్రీను, కొయ్య తాతారావు, కొండ్ర దుర్గాప్రసాద్, సూరాడ అజయ్, చోడిపిల్లి ప్రేమానందం, తిరిది ఎల్లమ్మ, చోడిపిల్లి సత్యవతి, మల్లె నూకరాజు, సూరాడ సత్యం, పెద్దసంఖ్యలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

వనమాడికి వెంకటేశ్వరుడి జ్ఞాపిక అందజేత

కాకినాడ సిటీ, జూన్ 6: కాకినాడ సిటీ ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో విజయం సాధించిన వనమాడి కొండబాబును గురువారం ఆయన నివాసంలో వివిధ వర్గాల వారు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. తిలక్‌స్ట్రీట్‌కు చెందిన నాయకులు బొబ్బిలి గోవిందు, దవులూరి భద్రరావు, యూత్ సభ్యులు శాలువాతో సత్కరించి వెంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేశారు. టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్ష, కార్యదర్శులు కొల్లాబత్తుల అప్పారావు, పలివెల రవి అనంతకుమార్ కలిసి అభినందనలు తెలిపారు. సాయంత్రం కొండబాబును నగర ప్రముఖులు, అధికారులు, పార్టీ శ్రేణులు మర్యాద పూర్వకంగా కలిశారు.

ఎమ్మెల్యే విజేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో పూజలు

పెద్దాపురం, జూన్ 6: పట్టణ పరిధిలో ఉన్న విశ్వేశ్వరచంద్రశేఖరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే విజేత నిమ్మకాయల చినరాజప్ప, జనసేన కాకినాడ జిల్లా ఇన్‌చార్జ్ తుమ్మల రామస్వామి (బాబు) గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి అఖండ విజయాన్ని సాధించడంతో ఈపూజా కార్యక్రమాలను నిర్వహించామని తెలిపారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రసాదాలను అందచేశారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజాసూరిబాబురాజు, కొరిపూరి రాజు, మేడిది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విజేత నెహ్రూకు సత్కారం

గండేపల్లి, జూన్ 6: జగ్గంపేటలో 52వేల పైచిలుకు ఓట్లు మెజార్టీ సాధించిన కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ ను గురువారం మండలంలో సూరంపాలెం, ఎన్టీరాజాపురం, యల్లమిల్లి, గండేపల్లి తదితర గ్రామాల నుంచి అభిమానులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోర్పు లచ్చయ్యదొర, నాయకులు కుంచే రాజా, పరిమి బాబు, వెలమాటి కాశీ, సుంకవిల్లి రమేష్, చాగంటి సత్యనారాయణ, ఇప్పిర్ల బాబీ, సుంకవిల్లి సత్యనారాయణ(సీఎం), మాదిరెడ్డి కృష్ణార్జున, మద్దిపూడి సత్యనారాయణ, టీడీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

20 సంవత్సరాల తర్వాత టీడీపీ జెండా

జగ్గంపేట నియోజకవర్గంలో 20 సంవత్సరాలు తర్వాత టీడీపీ జెండా ఎగిరింది. 2004లో కాంగ్రెస్ అధికారులు వచ్చిన దగ్గర నుంచి 2024 నేటివరకు మధ్యలో కాంగ్రెస్, వైసీపీలో ఈ నియోజకవర్గంలో కృష్ణవేణిసాయి 2024 ఎన్నికల్లో జ్యోతుల నెహ్రూ కూటమి అభ్యర్థిగా పోటీ చేయడంతో పాటు అభ్యర్థిగా పోటీ చేయడంతో పాటు భారీ మెజార్టీతో గెలుపొందడంతో జగ్గంపేట టీడీపీ కోటగా మరల్చు కున్నారు.

నెహ్రూకు నాయకులు, అధికారులు శుభాకాంక్షలు

జగ్గంపేట మండలం ఇర్రిపాక నెహ్రూ స్వగ్రామంలో ఉదయం నుంచి జనసునామీని తలపిస్తూ గజమాలతో, బొకేలతో, శాలువాలతో క్యూ కట్టికట్టారు. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, మహిళలు శుభాకాంక్షలు తెలిపారు.



రౌతులపూడి: మచిలీపట్నంలో అయ్యన్నను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

కోర్పు లచ్చయ్యదొర, ఎస్వీఎస్ అప్పలరాజు, దాసరి తమ్మన్నదొర, పరిమి బాబు, కందుల చిట్టిబాబు, కోర్పు సాయితేజ, జాస్తి వసంత్, పాలూరి బోసుబాబు, మారిశెట్టి భద్రం, కుంచేరాజా, అడబాల వెంకటేశ్వరరావు, వెలమాటి కాశి, ప్రోటు కృష్ణ, సుంకవిల్లి రమేష్, బత్తుల సత్తిబాబు, గుండా శివప్రసాద్ పాల్గొన్నారు.

- గోకవరం మండల టీడీపీ విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షుడు అడబాల సింగరయ్య, కొత్తపల్లి గ్రామ టీడీపీ అధ్యక్షుడు దిండి రాజు, కొత్తపల్లి 47వ బూత్ ఇన్‌చార్జ్ బీఎస్ఎన్ రాజు, సీనియర్ అడ్వకేట్ చింతలపూడి రమేష్‌బాబు జ్యోతులకు శుభాకాంక్షలు తెలిపారు.
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, బీజేపీ ఇన్‌చార్జ్ దాట్ల కృష్ణవర్మ, ఉపాధ్యక్షురాలు కామినేని జయశ్రీలు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మట్ట మంగారాజ్, జిల్లా కిసాన్ మోర్చ ఉపాధ్యక్షుడు బాలిన, యుగంధర్, గోకవరం, కిర్లంపూడి, గండేపల్లి, జగ్గంపేట మండల అధ్యక్షులు సత్తి వెంకటరెడ్డి, ఏడలి రాంబాబు, తోరాటి వెంకన్న, మేడిశెట్టి వీరబాబు, జిల్లా కమిటీ మెంబర్ కొత్త శ్రీనివాస్ రెడ్డి, అడపా దొరబాబు, సోషల్ మీడియా మణికంఠ, కో కన్వీనర్‌సురేష్, ఇనకోటి బాపన్న దొర, బత్తుల వెంకన్నబాబు, సురంపాలెం స్వామి, పల్లా రాము, పడాల సత్య నారాయణ, నాగేంద్ర, రాంబాబు, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రత్తిపాడు: టీడీపీ, జనసేన కార్యకర్తలు అన్నవరంకు చేపట్టిన పాదయాత్రను ప్రారంభిస్తున్న సత్యప్రభ

ఎమ్మెల్యే విజేత నెహ్రూకు అభినందనలు

కిర్లంపూడి, జూన్ 6: జగ్గంపేట ఎమ్మెల్యేగా జ్యోతుల నెహ్రూ విజయంతో కిర్లంపూడి మండల టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ముక్కొల్లు, సర్పంచ్ జ్యోతుల రాంబాబు, రామకృష్ణాపురం సర్పంచ్ కంటా సరస్వతి, జగపతినగరం సర్పంచ్ గుడాల శ్రీలత రాంబాబు, ముక్కొల్లు టీడీపీ సీనియర్ నాయకుడు బస్వా వీరబాబు తదితరులు నెహ్రూ ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.

అయ్యన్నను సత్కరించిన రౌతులపూడి టీడీపీ నేతలు

రౌతులపూడి, జూన్ 6: ఎమ్మెల్యేగా విజయం సాధించిన టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు చింతకాయల అయ్యన్న పాత్రుడుని రౌతులపూడి టీడీపీ నేతలు మాజీ ఎంపీపీ ఈటంశెట్టి సూర్యభాస్కరరావు, గంటా గోపి, అల్లు బుజ్జి, పైల సూరిబాబు దివాణం, అశోక్‌లు నర్సీపట్నం ఆయన నివాసంలో సత్కరించారు. రౌతులపూడిలో శ్రీహర్ష కాన్వెంట్ సమీపంలో శెట్టిపేటలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు అభినందనలు తెలుపుతూ మాజీ సర్పంచ్ పైల సాంబశివరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పైల అశోక్, ఈటంశెట్టి రమణ, గాడి వరహాలు, గొల్లు గోపి, కర్రి అప్పలనాయుడు, తోట శివ పాల్గొన్నారు.

నానాజీకి నాయకుల అభినందన

సర్పవరం జంక్షన్, జూన్ 6: కాకినాడ రూరల్ ఎమ్మెల్యేగా విజయ దుందుభి సాధించిన పంతం వెంకటేశ్వరరావు (నానాజీ)కి కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులతో అభినందించారు. ఎమ్మెల్యేగా విజయం సాధించిన వెంటనే మంగళవారం సాయంత్రం మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయానికి నానాజీ వెళ్లి, గురువారం కాకినాడ తిరిగి వచ్చారు. గురువారం సాయంత్రం వలసపాకల జనసేన పార్టీ కార్యాలయానికి విచ్చేసిన నానాజీని కలిసేందుకు కాకినాడరూరల్ నియోజకవర్గంతో పాటూ పెద్దఎత్తున కార్యకర్తలు, కూటమి నాయకులు తరలివచ్చి బొకేలు, గజమాలలతో ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు.

కూటమి విజయం రాష్ట్రానికి అదృష్టం

కరప, జూన్ 6: ఈ ఎన్నికల్లో కూటమి విజయం సాధించడం రాష్ట్రానికి అదృష్టంగా భావించాలని రాష్ట్రీయ హిందూచైతన్య సదస్సు అధ్యక్షుడు పడాల రఘు పేర్కొన్నారు. నడకుదురులో గురువారం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వానికి టీడీపీ ఎంపీ సీట్లు కీలకంగా మారిన నేపథ్యంలో రాష్ట్రాభివృద్ధికి మహర్దశ పట్టనుందన్నారు. రాష్ట్ర విభజనతో మనకు జరిగిన అన్యాయాన్ని పూరించడానికి ఇదే చక్కని అవకాశమన్నారు. రాష్ట్రానికి కావాల్సిన స్పెషల్ స్టేటస్, పోలవరం నిర్మాణం, రాజధాని అభివృద్ధి వంటి అంశాలపై దృష్టిసారించాలని సూచించారు.

కూటమి విజయంతో ప్రవాసాంధ్రుల సంబరాలు

కరప, జూన్ 6: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించడంతో ప్రవాసాంధ్రులు సంబరాల్లో మునిగితేలారు. కాకినాడజిల్లా కరప మండలం పెనుగుదురు గ్రామానికి చెందిన నామన లక్ష్మిసుప్రియ సహచర మిత్రులు, ఉద్యోగస్తులు జనసేన, టీడీపీ కండువాలు, జెండాలతో లండన్ వీధుల్లో ర్యాలీగా తిరిగి భారీ కేక్ కట్ చేశారు. జై జనసేన అంటూ నినాదాలు చేస్తూ కూటమి విజయంపై హర్షాతిరేకాలు వ్యక్తంచేశారు.

ధర్మవరంలో బీజేపీ సంబరాలు

ప్రత్తిపాడు, జూన్ 6: కేంద్రంలోని, రాష్ట్రంలోని ఎన్డీయే సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించడంపట్ల గురువారం మండలంలోని ధర్మవరం బీజేపీ కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. స్థానిక మండల బీజేపీ ఉపాధ్యక్షుడు ఊటా వీరబాబు స్వగృహం వద్ద జిల్లా బీజేపీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. అనంతరం రామ్‌కుమార్‌ను బీజేపీ నాయకులు వీరబాబు, నక్కా శ్రీనులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సిద్దపు రెడ్డి చంద్రరావు, రామకర్రి సూర్యనారాయణ, దొడ్డి పట్ల సుబ్బరాజు, బొల్లు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాచపల్లి నుంచి అన్నవరానికి పాదయాత్ర

ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థిగా వరుపుల సత్యప్రభ రాజా ఘన విజయం సాధించడాన్ని పురస్కరించుకుని గురువారం మండలంలోని రాచపల్లి నుంచి అన్నవరంనకు టీడీపీ, జనసేన కార్యకర్తలు పాదయాత్ర చేపట్టారు. స్థానిక మాజీ సర్పంచ్ అన్నవరం మాజీ పాలక మండలి సభ్యుడు బుద్దరాజు గోపిరాజు ఆధ్వర్యంలో కార్యకర్తలు చేపట్టిన పాదయాత్రను సత్యప్రభ రాజా ప్రారంభించారు. అనంతరం రాచపల్లి నుంచి 30కిలోమీటర్ల మేర టీడీపీ, జనసేన కార్యకర్తలు ఈ పాదయాత్రచేపట్టి సత్యదేవుని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాచపల్లి ఎంపీటీసీ సభ్యుడు పెదిరెడ్డి నాగేశ్వరరావు, నాగు, హరిబాబు, దుర్గ, చక్రవర్తి, గోపి, శ్రీను, రమణ, సురేష్, గణపతి, వీరబాబు, అశోక్, బాబ్జి, ప్రకాష్, బాబి, రాజా, నాగు, రాము తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా విజయంలో మేము భాగస్వాములమే'

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 6: ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించిన సందర్భంగా ఏపీ ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ శుభాకాంక్షలు తెలిపింది. స్థానిక పెన్షనర్స్ భవన్‌లో విలేకరుల సమావేశం గురువారం నిర్వహించారు. నూతన ప్రభుత్వానికి అన్ని ఉద్యోగ సంఘాలతోపాటు పింఛనుదారులు పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. ప్రజావిజయంలో తాము భాగస్వాములమేనన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ఎస్ఎన్‌పీ శాస్త్రి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కాకినాడ జిల్లా అధ్యక్షుడు కె.పద్మనాభం, రాష్ట్ర కార్యదర్శులు ఎస్.ఇబ్రహీం, సాజిదా, జిల్లా కార్యదర్శి తుమ్మల నూకరాజు పాల్గొన్నారు.



కరప: లండన్‌లోని పికాడిల్లీ సర్కస్ వద్ద సంబరాలు చేసుకుంటున్న ప్రవాసాంధ్రులు



సర్పవరం: ఎమ్మెల్యే విజేత పంతం నానాజీకి స్వీట్లు తినిపిస్తున్న బీసీ సంఘాల నాయకులు

వనదుర్గ ఆలయంలో ప్రత్యంగిర హోమం



హోమ పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

అన్నవరం, జూన్ 6: రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో గురువారం అమావాస్య పర్వదినం సందర్భంగా ప్రత్యంగిర హోమం నిర్వహించారు. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం ప్రత్యంగిర దేవతను ఆవాహన గావించి జపములు, పారాయణలు గావించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేరేళ్లమ్మ జాతర: గ్రామదేవతగా పూజలందుకుంటున్న నేరేళ్లమ్మ జాతర గురువారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అన్నవరం పరిసరప్రాంతం భక్తులు విచ్చేసి అమ్మవారికి సారెచీర పంపిణీ చేశారు. రాత్రి 8గంటల నుండి వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. మధ్యాహ్నం దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

ఘనంగా మదుగులమ్మ జాతర

సామర్లకోట, జూన్ 5:సామర్లకోట మండలం హుస్సేన్‌పురం గ్రామ దేవతగా ప్రసిద్ధి పొందిన మదుగులమ్మ అమ్మవారి జాతర ఉత్సవం బుధవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమైంది. గ్రామ ఉత్సవ కమిటీ నాయకులు చల్లా బుజ్జి తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాతర ఉత్సవంలో ఎమ్మెల్యే చినరాజప్ప తనయుడు నిమ్మకాయల రంగనాగ్ హాజరై అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ జాతరలో కోట అప్పారావు, చల్లా ప్రభాకరరావు, జానా శ్రీను, కోట సురేష్, పుప్పాల నాయుడు, పుప్పాల అప్పారావు, తలారి శ్రీను పాల్గొన్నారు. 9న మహాన్నదానం నిర్వహించనున్నట్టు కమిటీ ప్రతినిధి బుజ్జి తెలిపారు.

కొమరగిరిలో నేరేళ్ళమ్మ తల్లి జాతర

కొమరగిరి(కొత్తపల్లి) జూన్ 6: కొమరగిరి గ్రామదేవత శ్రీనేరేళ్ళమ్మ తల్లి జాతర గురువారం వైభవంగా జరిగింది. కొ త్తపల్లి మండలంలో పలు గ్రామాలకు చెందిన భక్తులు నేరె ళ్ళ తల్లికి మొక్కులు చెల్లించుకొని దర్శనం చేసు కు న్నారు. నేరేళ్ళమ్మతల్లి జాతర అంటే నేలచల్లబడు తుం దన్న భక్తులు విశ్వసిస్తుంటారు. దానిలో భాగంగా జాతర ముందురోజున జరిగే జాగారం నాడు బుధవారం వర్షం కురవడంతో ప్రజలు చల్లదనంతో సేదతీరారు. నేరేళ్ళమ్మ తల్లిని దర్శనం చేసుకొన్న భక్తులకు ఆలయ కమిటీ ప్రతినిధులు గాజులు, ప్రసాదాన్ని అందజేశారు.

రాపర్తిలో...

పిఠాపురం రూరల్, జూన్ 6: పిఠాపురం మండలం రాపర్తిలో నేరేళ్లమ్మ జాతర గురువారంరాత్రి వైభవంగా జరిగింది. గరగనృత్యాలు, విచిత్ర వేషధారణలతో జాతర మహోత్సవాన్ని జరిపించారు. అమ్మవారికి భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. మొక్కుబడులు సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

వైభవంగా గజ్జాలమ్మ జాతర

గొల్లప్రోలు, జూన్ 6: గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామ దేవతగా విరాజిల్లుతున్న గజ్జాలమ్మ జాతర మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి రాత్రి వరకూ ఆలయానికి భక్తులు పోటెత్తారు. గజ్జాలమ్మను దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద తీర్థం జరిగింది. ఆలయకమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా పోలేరమ్మ జాతర

పెద్దాపురం, జూన్ 6: మండలంలోని కట్టమూరు గ్రామదేవత పోలేరమ్మ జాతర మహోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈజాతర మహోత్సవాల్లో భాగంగా డప్పు వాయిద్యాలు, గరగల నృత్యాలు, కళ్లు మిరుమిట్లు గొలిపే బాణా సంచా ఏర్పాటు చేశారు. అనంతరం ప్రసాదాలను వితరణ చేశారు. గుడివాడలో గ్రామదేవత పచ్చాలమ్మ జాతర మహోత్సవాలు, దివిలిలో ఉన్న జట్లమ్మ జాతర మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు హాజరై అన్న ప్రసాదాన్ని స్వీకరించారు..

వైసీపీకి మున్సిపల్ వైస్ చైర్మన్ గుడ్ బై

పెద్దాపురం, జూన్ 6 : పెద్దాపురం మున్సిపల్ రెండో వైస్‌చైర్మన్ కనకాల మహాలక్ష్మీ, ఆమె భర్త కనకాల సుబ్రహ్మణ్యం వైసీపీకి రాజీనామాను ప్రక టించారు. ఈమేరకు వారి స్వగృహంలో గురువారం ఏర్పా టుచేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. తమకు పార్టీలో సరైన గుర్తింపులేదని, తాము ఎన్నో అవమానాలు భరించామన్నారు. తమ వార్డు పరిధిలో ఉన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం వైస్‌చైర్మన్‌గా మాత్రం కొనసాగుతానని ఆమె పేర్కొన్నారు. వారి కుమారుడు శ్రీకాంత్ జనసేనపార్టీ కార్యకమాల్లో చురుగ్గా పాల్గొంటానన్నారు.

మెడిసిన్ విద్యార్థికి రాజప్ప అభినందన

పెద్దాపురం, జూన్ 6 : మండలంలోని కాండ్రకోట గ్రామానికి చెందిన మార్నిడి వెంకట ప్రకాష్ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (మెడిసిన్)లో అర్హత సాధించడంతో ఎమ్మెల్యే విజేత నిమ్మకాయల చినరాజప్ప అభినందించారు. ఈ కార్యకమంలో ఎలిశెట్టి నాని తదితరులు పాల్గొన్నారు.

ఊజీ ఈగల నియంత్రణకు సహకరించాలి

గొల్లప్రోలురూరల్, జూన్ 6: పట్టుపై ఊజీ ఈగల ప్రభావం అధికమవుతున్నదని, దీని నియంత్రణకు రైతులు సహకరించాలని సెరికల్చర్ అధికారి టి.మోసయ్య కోరారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు పట్టుపరిశ్రమల కేంద్రంలో రైతులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దీనిని మొదట్లోనే అరికట్టకుంటే దిగుబడులపై ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు. ఊజీ ఈగల నియంత్రణకు మైసూర్ నుంచి పౌచెస్ తెప్పించాల్సి ఉంటుందని చెప్పారు. 15 రోజులకు రెండు పౌచెస్ వంతున మల్బరీ షెడ్డుల వద్ద కట్టాలని సూచించారు. దీని కోసం రైతులు మల్బరీ ఆఫీసుకు వచ్చి వివరాలు తెలుసుకోవాలని కోరారు.

మైనింగ్ చెక్‌పోస్టులు ఎత్తివేయాలి

రౌతులపూడి, జూన్ 6: రౌతులపూడి, బలరామపురం, బంగారయ్యపేట గ్రామాల్లోగల వైసీపీ ఎంపీ అభ్యర్థి సునీల్‌కు చెందిన ప్రైవేట్ మైనింగ్ చెక్‌పోస్టులను ఎత్తి వేయాలని రౌతులపూడి మండల ట్రాక్టర్స్ యూనియన్ సభ్యులు ఆందోళన చేశారు. పేదలు పునాదులకు మట్టి తరలిస్తున్న మైనింగ్ కట్టించుకోవడం దారుణమన్నారు. పేదలపై మైనింగ్ వల్ల అదనపు భారం పడుతుందన్నారు. ముందుగా బలరామపురం మైనింగ్ చెక్‌పోస్టుకు కార్యాలయానికి సంబంధించిన పాకను తొలగించారు. అనంతరం రౌతులపూడి మైనింగ్ చెక్‌పోస్టు వద్ద ఆందోళన చేశారు. ట్రాక్టర్స్ యూనియన్ యాజమాన్యంతో ట్రాక్టర్స్, లారీలు వద్ద మైనింగ్ వసూళ్ల నిలిపివేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

సామర్లకోట, జూన్ 5: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం అందరిపైనా ఉందని సామర్లకోట మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య అన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా సామర్లకోట మండలం వేట్లపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు అనూరాధ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్య క్రమంలో ముఖ్యఅతిథిగా ఎంఈవో శివరామకృష్ణయ్య హాజరయ్యారు. పీవీ.సత్యన్నా రాయణ, ఎన్వీవీఎన్ ఎస్.కుమారి, బి.వెంకటలక్ష్మి, కెవీ.రామలక్ష్మి, ఎం.బాబూరావు, పి.రూన్సీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సామర్లకోట రైల్వే స్టేషన్లో..

సామర్లకోట రైల్వే స్టేషన్ ఆవరణలో ప్రపంచ పర్యావరణ పరిరక్షణ సందర్భంగా రైల్వే సిబ్బంది ఘనంగా నిర్వహించారు. రైల్వే సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. పర్యావరణ పరిరక్షణపై పలువురు ప్రయాణికులకు అవగాహన కల్పించేందుకు స్టేషన్ అవరణలో ర్యాలీ నిర్వహించారు. ప్రయాణీకులకు, రైల్వే వెండర్ వ్యాపారులకు అవగాహన కల్పించడంలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ గ్లాసులను మాత్రమే వినియోగించాలని తెలిపారు. ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైల్వే వైద్యాధికారి చెన్నకేశవరెడ్డి, ఎస్ఎస్. శ్రీధర్, కళ్యాణి, రవికాంత్, శ్రీదేవి, రైల్వే ఆరోగ్య సిబ్బంది పలువురు రైల్వే కార్మికులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

రౌతులపూడి, జూన్ 6: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించుకోవాలని మాజీ ఎంపీపీ ఈటంశెట్టి సూర్యభాస్కరరావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురష్కరించుకుని టీడీపీ యువనేత ఈటంశెట్టి అశోక్‌తో కలిసి రౌతులపూడిలో మొక్కలు నాటారు. టీడీపీనేతలు గంటా గోపి, అల్లు బుజ్జీ, సుర్ల జేమీలు, యర్రా వరహాలదొర, పైల సూరిబాబు, దివాణం, చినబాబు పాల్గొన్నారు.

స్థల వివాదంలో ఒకరికి గాయాలు

కరప, జూన్ 6: స్థల వివాదంలో జరిగిన ఘర్షణలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నాడు. కరప పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కరప సీతమ్మపేటలో ఉంటున్న పెంకే లోవరాజు, శ్రీనివాస్ అనే సోదరుల మధ్య ఎప్పటినుంచో 10 సెంట్ల స్థలంపై వివాదం కొనసాగుతోంది. గురువారం ఉదయం మరోసారి ఈ స్థలం కోసం వారి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో శ్రీనివాస్ భార్య లక్ష్మి కత్తిపీటతో లోవరాజుపై దాడిచేసి తీవ్రంగా గాయపర్చింది. దీంతో కుటుంబసభ్యులు క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ వి.సూరిబాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అందరి సహకారంతో ఎన్నికలు విజయవంతం: ఆర్డీవో

పెద్దాపురం, జూన్ 6 : అందరి సహాయ సహకారాలతో ఎన్నికలు విజయవంతంగా నిర్వహించగలిగామని ఆర్డీవో జె.సీతారామారావు అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో విలేఖరులతో ఆయ న గురువారం మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేశామన్నారు. పోలింగ్ సిబ్బంది ఎంతో అంకితభావం, నిబద్ధతతో తమ విధులను నిర్వర్తించారన్నారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియతోపాటు ఈసీ నూతనంగా తీసుకువచ్చిన హోమ్ ఓటింగ్ ప్రక్రియలో భాగస్వామ్యం అయిన అధికారులకు, నోడల్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, ఈఆర్వోలు, ఎఫ్ఎస్టీ, వీఎస్టీ, ఎస్ఎస్టీ బృందాలు, మీడియాకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

ఏలేశ్వరం, జూన్6: స్థానిక గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వారోత్సవాలు గురువారం ముగిశాయి. వేసవి శిబిరంలో విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్ వివిధ అంశాలలో పాల్గొన్న విజేతలకు లయన్స్ క్లబ్ అధ్యక్షులు అనసూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రసంసా పత్రాలు అందజేశారు. ఈకార్యక్రమంలో జ్యోతుల శ్రీనివాస్, అలమండ దుర్గా ప్రసాద్, కప్పల నాగభూషణం పాల్గొన్నారు.

టీడీపీ అధినేత చంద్రబాబును కలిసిన దివ్య

తుని రూరల్, జూన్6: తుని ఉమ్మడి అభ్యర్థిగా విజయం సాధించిన సందర్భాన్ని పురస్కరించుకుని యనమల దివ్య జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు.ఈ సందర్భంగా చంద్రబాబు దివ్య గెలుపు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

ఇద్దరు ఎమ్మెల్యేలను ఇచ్చిన ఘనత ఏవీ నగరానిది

తొండంగి, జూన్ 6: తుని నియోజకవర్గానికి ఇద్దరు ఎమ్మెల్యేలను ఇచ్చిన ఘనత యనమల స్వగ్రామం ఏవీ నగరం సొంతం చేసుకుంది. గతంలో తుని రాజ కుటుంబానికి చెందిన రాజా వెంకటకృష్ణంరాజు బహద్దర్(రాజా బుల్లిబాబు) ఆయన కుమార్తె ఎం.ఎన్. విజయలక్ష్మీదేవి, బుల్లిబాబు మనుమడు రాజా అశోక్‌బాబులు ఎమ్మెల్యేలుగా పనిచేశారు. బుల్లిబాబు కుమార్తె విజయలక్ష్మీ దేవి స్త్రీ శిశు సంక్షేమశాఖా మంత్రిగా పదవీ బాధ్యతలు నిర్వహించారు. తిరిగి ఇప్పుడు యనమల రామకృష్ణుడు కుమార్తె యనమల దివ్య ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో ఒకరికంటే ఎక్కువమంది ఎమ్మెల్యేలుగా ఎన్నికైన కుటుంబంలో యనమల కుటుంబం కూడా చేరింది. దీంతో ఆ ఘనత ఏవీ నగరం సొంతమైంది.



లోకేష్‌ను కలిసిన సత్యప్రభ

చంద్రబాబు, లోకేష్‌లను కలిసిన సత్యప్రభ

ప్రత్తిపాడు, జూన్ 6: టీడీపీ అధినేతలు చంద్రబాబు నాయుడు, లోకేష్‌లను గురువారం ప్రత్తిపాడు ఎన్డీయే కూటమి అభ్యర్థిగా విజయం సాధించిన వరుపుల సత్యప్రభ రాజా కలిశారు. అమరావతిలోని ఉండవిల్లి నివాసం వద్ద పార్టీ అధినేతలు ఇరువురిని కలిసి బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వరుపుల రాజా ఆశయాలు నెరవేర్చడం కోసం అద్భుతంగా పనిచేశారని ఈ సందర్భంగా చంద్రబాబు, లోకేష్‌లు అభినందించారు.

చంద్రబాబును కలిసిన జ్యోతుల నవీన్

కాకినాడ సిటీ, జూన్ 6: సార్వత్రిక ఎన్నికల్లో చరిత్రలో నిలిచిపోయేలా విజయాన్ని అందుకున్న టీడీపీ జాతీయ అధ్యక్షుడు, కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబును గురువారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ చరిత్ర సృష్టించిన కూటమి విజయం వెనుక చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ కష్టం ఎంతో ఉందని, ఒక నియంతపై పోరాడి గెలిచిన నేతలని అన్నారు. రాష్ట్ర ప్రజలందరూ చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ నేతృత్వంలో ప్రభుత్వ ఏర్పాటు కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు.

భావనారాయణస్వామి ఆలయ కమిటీ రాజీనామా

సర్పవరం జంక్షన్, జూన్ 6: శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి ఆలయ కమిటీ చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ పుల్ల నారాయణరావు తెలిపారు. గురువారం సర్పవరం ఆలయంలో పాలకవర్గం సభ్యులతో కలసి తమ రాజీనామా పత్రాన్ని ఆలయ ఈవో జొన్నాడ భీమశంకరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ పార్టీ ఓడిపోయిన నేపథ్యంలో రాజీనామా చేశామన్నారు. ఎమ్మెల్యే కన్నబాబు సహకారంతో 14 నెలల పదవీకాలంలో ఆలయ అభివృద్ధికి కృషి చేశామన్నారు. ప్రతీ ఆదివారం ఉచిత అన్నదాన కార్యక్రమం అమలు చేశామన్నారు. రూ. 39 లక్షల ఆదాయం నుంచి స్వామివారికి రూ. 83 లక్షలకు పెరిగేలా కృషి చేశామన్నారు. విద్యుద్దీకరణ చేశామని, అన్యాక్రాంతమైన స్వామివారి ఆస్తులను పరిరక్షించేందుకు కృషిచేసి, తిమ్మాపురంలో 21/2 సర్వే నెంబర్‌లో 8.40 సెంట్లు భూమి, పనసపాడులో 2.30ఎకరాల భూమిని దేవదాయ,ధర్మాదాయశాఖ ప్రోపర్టీ రిజిష్టర్‌లో నమోదు చేయించామన్నారు. సమావేశంలో సభ్యులు వి.వరలక్ష్మి,పివీవీ సత్యనారాయణ, జోకా సత్తిబాబు, ఎస్ అప్పారావు, పి. మరిడమ్మ, జి. బద్రీనారాయణ పాల్గొన్నారు.



రాజీనామా పత్రాన్ని ఈవో భీమశంకరరావుకు అందజేస్తున్న చైర్మన్ పుల్ల నారాయణరావుతో సభ్యులు